క్లుప్తంగా

ఎలక్ట్రానిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ



విద్యుత్ సరఫరా తీరును విద్యార్థులకు వివరిస్తున్న ఏఈ షాజహాన్

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 9,10వ తరగతి ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం స్థానిక విద్యుత్ స్టేషన్ సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయుల సమక్షంలో విద్యుత్ నిలువ, సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ తదితర అంశాలపై ఏఈ షాజహాన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఏనర్జీ మీటర్, ఓల్ట్ మీటర్, బ్యాటరీ చార్జర్ పరికరాలు పనిచేయు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐటీ ఉపాధ్యాయుడు బాలయ్య, ఉపాధ్యాయురాలు మధురిమ తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులు జాగ్రత్తలు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రంగనేతాజీ

చాగలమర్రి: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులు జాగ్రత్తలు పాటించాలని, వరి దుబ్బులను కట్టలుగా కట్టుకోవాలని ఏఓ రంగనేతాజీ సూచించారు. మండలంలోని చిన్న వంగలి, పెద్దవంగలి గ్రామాలలో బుధవారం ఏఓ పోలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి మళ్లను పరిశీలించారు. పంటల బీమా కొరకు రైతులు తమవంతు ప్రీమియం డిసెంబర్ 15లోపు చెల్లించాలని సూచించారు.

గ్రామ పంచాయతీ ఆడిట్ ప్రారంభం



రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్ సుభాషిణి

ఉయ్యాలవాడ: మండలంలోని గ్రామపంచాయతీల ఆడిట్ బుధవారం ప్రారంభం అయ్యింది. స్థానిక మడలపరిషత్ కార్యలయలంలో జిల్లా పంచాయతీల ఆడిటర్ సుభాషిణి ఆర్.పాంపల్లె, మాయలూరు, ఇంజేడు, సుద్దమల్ల. ఎస్.కొత్తపల్లె గ్రామ పంచాయతీల సంబధించిన పద్దుల ఆడిట్ చేపట్టారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు గ్రామ పంచాయతీలకు మంజూరు అయిన నిధులను తనిఖీ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుల వివరాలకు సంబంధించిన రికార్డులను, ఎంబుక్కులు, రసీదులను ఆమె పరిశీలించారు.

విత్తనాల ప్రాసెసింగ్‌లో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(అర్బన్): విత్తనాలు ప్రాసెసింగ్ చేటప్పుడు కల్తీలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఏఓ మురళీకృష్ణ సూచించారు. స్థానిక కార్యాలయంలో జిల్లాలోని విత్తన శుద్ధి కేంద్రాల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన రకాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలని, ప్రాసెసింగ్ ప్లాంట్ రిజిస్టర్, డిస్పాచ్ రిజిస్టర్, బ్రీడర్ రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ప్యాకింగ్‌లో వేరే రకం విత్తనాలు కలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, అశోకవర్ధన్‌రెడ్డి, ప్రసాదరావు, విజయ్‌శేఖర్, శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 41 రోజుల పండుగ



ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): బొమ్మలసత్రంలో ఇటీవల పునర్నిర్మించిన శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 41 రోజుల పండుగను శ్రీ సాయి సేవా కమిటీ సభ్యులు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామివారి మూలవిరాట్‌కు మేలుకొలుపు హారతి, సుప్రభాత సేవా కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. మధ్యాహ్నం హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మరిగించి.. నాణ్యత తగలేసి

- హోటళ్లలో వినియోగించిన నూనెలే మళ్లీ మళ్లీ వాడకం
- టీపీసీ25 దాటితే ఇబ్బందులు తప్పవంటున్న నిపుణులు
- ఎక్కువ మరిగిన నూనెలతో ప్రమాదకర జబ్బులు
- అధికారుల తనిఖీల్లో 20 కేసులు నమోదు



హోటళ్లలో మరిగిన నూనెతో వంట చేస్తున్న దృశ్యం



నూనెను పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు : గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు హోటల్స్, రెస్టారెంట్, బేకరీ నిర్వాహకులకు ప్రజారోగ్యం ఏమాత్రం పట్టడంలేదు. వీటిలో బజ్జి మొదలుకొని టిఫిన్‌తో పాటు ఇతర పాస్టుఫుడ్ ఆహార పదార్థాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే మరిగించిన నూనెనే మరలా, మరలా వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనిపై అధికార యంత్రాంగం కూడా అంతంత మాత్రంగానే తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతా ప్రమాణాలు గాలికి...

జిల్లాలో పెద్దహోటళ్లు 86, చిన్న హోటళ్లు 220 దాకా ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వీటకి తోడు గ్రామీణ ప్రాంతాలు మొదలు ఎక్కడిక్కడ వీధి వ్యాపారాలకు చెందిన బండ్లు లెక్కకులేనన్ని ఉన్నాయి. వంట చేసుకోలేనివారు కొందరైతే, మరికొందరు కుటుంబం, స్నేహితులతో కలిసి సరదాగా బయట తినాలనేవారు ఉన్నారు. ఈ క్రమంలో కొందరు హోటళ్ల నిర్వాహకులు రుచి మాటను నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. కల్తీ పదార్థాల వినియోగంతో పాటు వంట నూనెలను పలుమార్లు వినియోగించి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఒకసారి వినియోగించిన నూనెనే మళ్లీ మళ్లీ వినియోగించి వండిన ఆహార పదార్థాలు తిన్నవారు ప్రమాదకర జబ్బులకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

నామమాత్రంగా తనిఖీలు

వాస్తవానికి హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్నారు. వీరు శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపి, పరిశీలన చేసి కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. అయితే జిల్లాలో అక్కడక్కడ, అప్పుడప్పుడు మినహా పూర్తి స్థాయిలో తనిఖీలు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తూ వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆరు నెలల్లో 20 కేసులు నమోదు..

అధికారిక సమాచారం మేరకు నూనె మరిగించే సమయంలో టీపీసీ (బోటల్ పోలార్ కౌంట్) 25కు మించకూడదు. అయితే పలు హోటల్స్, రెస్టారెంట్లలో మోతాదుకు మించి 25 టీపీసీ దాటిపోతు 30 ఆపై వరకు టీపీసీ నమోదవుతున్న నూనెను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రజా రోగ్యానికి హానికలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెబుతున్నారు. 2024 ఏడాదిలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 169 శాంపిల్స్ సేకరించి 20 కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నమోదైన కేసుల్లో ఆహారానికి పనిరాని కేసులు 6, నాణ్యతా లోపం కింద కేసులు 8, ఆయిల్ ఎక్కువసార్లు మరుగబెట్టిన కేసులు 6 ఉన్నాయి.

అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం



హోటళ్లలో నూనెల పునర్వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల ఆరోగ్య సంరక్షణకు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు తప్పనిసరిగా సహకరించాలి. జిల్లాలో కొన్ని చోట్ల టీపీసీ మోతాదుకు మించి నూనెలు వినియోగించిన వారిని గుర్తించి ఎప్పటికప్పుడు కేసులు నమోదుచేస్తున్నాం. ఈఏడాది ఇప్పటికే 20 దాకా కేసులు నమోదుచేశాం. ప్రజలు కూడా ఆహారపదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

– కుర్మ నాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి కర్నూలు జిల్లా

నేడు విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

నంద్యాల(అర్బన్): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగులు) దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కర్నూలు జిల్లాలోని ఔట్ డోర్ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతుల ఉమ్మడి జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్ నకలుతో గురువారం ఉదయం 8గంటలకు ఔట్‌డోర్ స్టేడియంలో హాజరు కావాలన్నారు. పోటీల్లో పాల్గొనే దివ్యాంగ ఉద్యోగులకు ఓడీ(ఆన్‌డ్యూటీ) సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ ఫోన్ నం .08518-277864ను సంప్రదించాలన్నారు.

పంట కోతలు వాయిదా వేసుకోండి

కొత్తపల్లి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని రైతులు పంట కోతలను వాయిదా వేసుకోవడం మంచిదని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పాత మాడుగుల, ఎర్రమతం, ముసలమడుగు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. తుపాను ప్రభావం తగ్గేవరకు వరి, మినుము రైతులు కోతలు చేపట్టరాదన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులకు డీఈఓ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపాల్ ఉన్నత పాఠశాలలో పర్యావణంపై జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ప్రాజెక్టు ప్రదర్శన పోటీలను జిల్లా ఎన్‌సీసీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఈఓతో పాటు రాష్ట్ర ఎన్‌సీసీ కోఆర్డినేటర్ నీలకంఠం, రీజనల్ కోఆర్డినేటర్ కుమార్ బాబు, ఉప విద్యాశాఖాధికారి మహబూబ్‌బేగ్ పాల్గొన్నారు. డీఈఓ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలన్నారు. పాఠశాలను సందర్శించినప్పుడు తప్పనిసరిగా తాను మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ పుట్టినరోజు ఒక మొక్కనాటితే జీవితకాలంలో 60 మొక్కలు నాటవచ్చని వెల్లడించారు. పర్యావరణంపై అవగాహన కల్పించేందుకే విజ్ఞాన మేళ, పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ప్రాజెక్టుల ప్రదర్శనలలో భౌగోళిక పచ్చదనం, జీవవైవిధ్య డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సుందరరావు, కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు, మెరుగైన సేవలపై సలహాలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ రావు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆర్టీసీ డిపోలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు సమస్యలు ఉంటే నేరుగా ఫోన్ చేసి తెలియజేయవలెనని ఆయన కోరారు సెల్ నంబర్ 73828 70767కు ఫోన్ చేయాలన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

నంద్యాల(న్యూటౌన్) : పట్టణంలోని 13వ వార్డు పొన్నాపురంలో శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శానిటేషన్ పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. పొడి, తడి చెత్తలను వేర్వేరుగా తరలించాలని సిబ్బందికి సూచించారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని తెలిపారు.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి బుధవారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన షేక్ కరీముల్లా సిటీ బస్టాండ్ వద్ద రోడ్డున పోయే మహిళల పట్ల అసభ్యకరంగా సైగలు చేస్తూ.. ఈలలు వేస్తుండతో స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆకతాయిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఏడు రోజులపాటు శిక్షను ఖరారు చేసినట్లు పోలీస్‌లు వెల్లడించారు.

ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆర్వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ : ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సాయం అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు ఆర్వీవీఎస్ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో జడ్జి మాట్లాడారు. ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు....ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు... తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులను వాదించేందుకు మీకు న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఉచిత న్యాయ సలహాలు, సూచనలు కావాలంటే ప్రతి మంగళ, శుక్రవారాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఉచిత న్యాయ సహాయం కావాలంటే లోక్ అదాలత్‌ను సంప్రదించవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారాన్యాయ సేవల గురించి తెలుసుకోవాలంటే 15100 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జైలు అధికారి శ ల్యంత్, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ అటెండెన్స్‌లేక ఇబ్బందులు

నంద్యాల(అర్బన్): ప్రస్తుత రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న 2.0 సిస్టంలో ప్రైవేట్ అటెండెన్స్ ప్రక్రియ లేక పోవడంతో వయోవృద్ధులు, అనారోగ్య సమస్యల తో బాధపడుతున్నవారు ఇబ్బందులు పడుతు న్నా రని నంద్యాల జిల్లా స్టాంపు రైటర్లు, స్టాంపు వెండర్ల సంక్షేమ సంఘం సభ్యులు ఫారుక్, రమేష్ తెలిపా రు. గతంలో ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంబించాలంటూ బుధవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సంఘం సభ్యులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసు కొని ప్రైవేట్ అటెండెన్స్ ప్రక్రియను పునః ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సుబ్రమణ్యం, షేక్ మాలిక్, శివరాం తదితరులు పాల్గొన్నారు

ఓటర్ల జాబితా ప్రకటన

నంద్యాల(అర్బన్): పట్టణంలోని జేవీఆర్‌నగర్ హౌస్ బిల్డింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి రాచయ్య బుధవారం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు డిసెంబర్ 4న నామినేషన్ల స్వీకరణ, 5న నామినేషన్ పరిశీలన, 6న నామినేషన్ల ఉపసంహరణ అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న నామినేషన్ల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. 13న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికల నిర్వహణ, అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు. 16న అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తులు



కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

మహానంది: కార్తీకమాసం సందర్భంగా మహానందిలో భక్తుల సందడి కొనసాగుతోంది. బుధవారం ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహామంగళహారతులు చేపట్టారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ఏకాంతసేవ పూజలు జరిగాయి.

బాల్యవివాహ రహిత రాష్ట్రంగా మారుద్దాం

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్‌ను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా మారుద్దామని ఐసీడీఎస్ సీడీపీఓ లీలావతి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నానైనా ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, హెల్త్ ఎడ్యుకేషన్, రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, స్టార్ సొసైటీ నిర్వాహకురాలు రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

కొనసాగిన ఫెన్సింగ్ పోటీలు



విజేతలతో క్రీడా సమాఖ్య అధికారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో బుధవారం రెండవ రోజున ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–19 ఫెన్సింగ్ బాలబాలికల పోటీలు నంద్యాల జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో కొనసాగాయి. ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, స్టేట్ అబ్జర్వర్ భవానీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ పాల్గొని రెండో రోజు క్రీడలను ప్రారంభించారు. అనంతరం బాలుర చాబర్, ఫాయిల్ టీం ఈవెంట్లలో విజేతలకు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దండె నాగరాజు, రవికుమార్, అడ్వైజర్ విశ్వనాథ్, కవి సాహితీ వేత్త శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో హిందూ సమ్మేళనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో మండల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం దేవస్థాన పరిధిలోని యాంఫీ థియేటర్ వద్ద హైందవ శంఖారావం పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్తీకమాసం సందర్భంగా మండల పరిధిలోని హిందువులతో కలిసి దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యులు యుగంధర్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో నేడు నందీశ్వరాభిషేకం

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో గురువారం సాయంత్రం ప్రదోష కాలంలో నందీశ్వరుడికి అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగే నందీశ్వరాభిషేకం కార్యక్రమంలో పాల్గొనాల్సిన భక్తులు మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయంలో ఉండాలని సూచించారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

శిరివెళ్ల: సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని డీఎస్పీ రవికుమార్ ప్రజలకు సూచించారు. బుధవారం సానిక పోలీస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏడాదిలో ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్ని పరిష్కారం అయ్యాయనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. అపరిచితుల కాల్స్, మేసేజీలకు స్పందించవద్దని ప్రజలకు సూచించారు. మోసపూరిత లింకులను అటెంప్ట్ చేయవద్దన్నారు. అలాగే మట్కా, పేకాటాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలపై ఎప్పటి కప్పుడు నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతి భద్రలతపై సిబ్బందికి తగిన సూచలు చేస్తున్నామని, ఇటీవల కాలంలో కార్డన్ సెర్చ్ ముమ్మరం చేశామన్నారు. నాయకులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న చక్రం ముల్లా షబ్బీర్

చాగలమర్రి: క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ హామీ ఇచ్చారు. చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ అందజేసిన రూ. 1 లక్షలతో మైదానంతోపాటు క్రికెట్‌నెట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం నెట్ ప్రాక్టీస్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్‌ను హెచ్‌ఎం కోటయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. పూలమాలువేసి శాలువాతో సత్కరించారు. తదనంతరం హెచ్‌ఎం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ మాట్లాడారు. చాగలమర్రి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ సత్తాచాటి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని పిలుపునిచ్చారు. చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ పాఠశాల అభివృద్ధికి ఎంతో సాయం చేశారని ఈ సందర్భంగా హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల మేయిన్ గేటు నిర్మాణానికి రూ.3.50 లక్షలు విరాళంగా అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు ఐడీకే శాస్త్రీ, శివశంకర్, సురేషప్పా, రవీంద్రారెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపునకు రంగం సిద్ధం

మహానంది: మహానంది గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజును తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజును తొలగించాలని కొందరు స్థానిక టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గ్రామ పర్యటన సందర్భంగా కొంత ఆర్థిక సహాయం చేశారు. ఆర్థిక సహాయం పొందడం నేరమన్నట్లు స్థానిక నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని పట్టుబట్టడంతో ఈ నెల 12న బుక్కాపురంలో సామాజిక తనిఖీ కార్యక్రమం ముగిసిన అనంతరం బలవంతంగా రాజీనామా లేఖను రాయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఏపీఓ మనోహర్‌ను సంప్రదించగా అధికారికంగా అతను ఎలాంటి రాజీనామా లేఖ ఇవ్వలేదని, తాము అందుకోలేదని చెప్పారు.

రైతులే విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలి

వెలుగోడు: రైతులు స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలని, గ్రామానికి కావలసిన విత్తనం గ్రామ స్థాయిలోనే తయారు చేసుకోవాలని నంద్యాల డీఆర్సీ ఏఓ హేమలత తెలిపారు. మండలంలోని బోయరేవుల గ్రామంలో బుధవారం ఏవో పవన్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని గ్రామ విత్తన ఉత్పత్తి పథకం గురించి వివరించారు. బొయిరేవుల,వేల్పనూరు,వెలుగోడు గ్రామాల్లో ఖరీఫ్ 2024 వరి పంట సీడ్ విలేజ్ ప్రోగ్రాం గ్రామ విత్తన ఉత్పత్తి పథకం అమలు చేస్తున్నామని, క్షేత్ర స్థాయిలో ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి ఇది ప్రభావవంతమైన మార్గం అన్నారు. గ్రామ సభ అనంతరం గ్రామీణ విత్తన ఉత్పత్తి క్షేత్రాలను పరిశీలించారు. ఏఈఓ సుధారాణి ఉన్నారు.

ఉపాధిపనులు వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ: గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఏపీఓ రవి ప్రకాశ్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించి వారి సంఖ్య పెంచాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

చాగలమర్రి: చింతలచెరువులో నాలుగురోజుల క్రితం దేరంగుల లక్ష్మీనరసింహులు, భార్య సుబ్బలక్ష్మీ దాడిలో తీవ్రంగా గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్న లక్ష్మీనరసింహుడు కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నిందుతులపై హత్య కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లతో పాటు మండల శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.